క్లుప్తంగా

రూ.పది వేల విరాళం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధిలోని గంగాయిపేట్‌లో నిర్మిస్తున్న అభయాంజనేయస్వామి ఆలయానికి గ్రామానికే చెందిన హైకోర్టు న్యాయవాది డి.సత్యనారాయణ రూ.10వేల విరాళం సోమవారం గ్రామంలోని కమిటీ సభ్యులకు అందజేశారు. దొనికేని సాగర్, దాడిశెట్టి కృష్ణ, వెంకటేశ్వర్‌రావు, తిరుమలగిరి, ఉపేందర్, నారాయణ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో 'ఏలేటి' పూజలు

మామడ: మండలంలోని కప్పన్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్, పోచమ్మ ఆలయాల్లో సోమవారం బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యన్నగారి భూమయ్య, అంజుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ ఇవ్వడం లేదని నిరసన



దుకాణం ముందు బైఠాయించిన ప్రజలు

లక్ష్మణచాంద: తమకు కొద్దిరోజులుగా రేషన్ సరుకులు సరిగా పంపిణీ చేయడం లేదంటూ సోమవారం మండల కేంద్రంలోని ఓ రేషన్ దుకాణం ఎదుట పలువురు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హనుమంతు అక్కడకు వెళ్లి వారితో మాట్లాడారు. సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. ఆర్ఐ దేవిక తదితరులు ఉన్నారు.

చిన్నారులకు దుస్తులు పంపిణీ

కడెం: మండలంలోని అల్లంపల్లి పంచాయతీ పరిధిలోని చింతగూడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో 32 మంది గిరిజన చిన్నారులకు డీఆర్డీవో విజయలక్ష్మి దుస్తులు అందజేశారు. సోమవారం తన కుమారుడి జన్మదినం సందర్భంగా రూ.15వేల విలువైన దుస్తులు ఒక్కొక్కరికి రెండు జతలు అందించినట్లు వారు పేర్కొన్నారు.

ఎద్దు మృతి

లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్‌తండాలో ఆడె బాలాజీకి చెందిన ఎద్దు సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధితుడి వివరాల ప్రకారం.. రోజు మాదిరి మేతకు వెళ్లిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా అవుతున్న ఎర్తింగ్ తీగకు తగిలి మృతి చెందింది. ఎద్దు విలువ రూ.65 వేలు ఉంటుందని.. విద్యుత్ అధికారులు పరిహారం చెల్లించాలని రైతు వేడుకున్నాడు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రారంభించారు. అంతకుముందు సుర్జాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. మోహిద్, శ్రీనివాస్‌రెడ్డి, అనురాధ, శంకర్, రవి, రాజేందర్, వెంకాగౌడ్, వాల్‌సింగ్, మల్లేశ్, చరణ్, నిమ్యానాయక్, శంకర్, వినీశ్ పాల్గొన్నారు.

రైతులకు పరిహారమివ్వాలి

నిర్మల్‌రూరల్: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తల్వేద, మంజులాపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. రైతులు నష్టపోకుండా కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇందులో రంజిత్, సిద్ధార్థ, చంద్రయ్య, సాయన్న, సునీల్, భూమన్న, అనిల్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

లక్ష్మణచాంద: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎంపీపీ అడ్వాల పద్మ పేర్కొన్నారు. ఇటీవల మండలస్థాయి సీఎంకప్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన 20 మంది క్రీడాకారులకు సోమవారం ఎంపీపీ పద్మ-రమేశ్ దంపతులు రూ.10వేల విలువైన దుస్తులు పంపిణీ చేశారు.

మత్స్యకారులకు న్యాయ సదస్సు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఎమ్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జిల్లాలోని గంగపుత్ర మత్స్యకారులకు హైకోర్టు న్యాయవాదులు పూస మల్లేశ్, అరవింద్ న్యాయ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్యకారులపై జరిగే దాడులపై వారు అడిగిన ప్రశ్నలకు సూచనలు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు పల్లికొండ ముత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జగిత్యాల అధ్యక్షులు పి.ప్రవీణ్, గంగపుత్రుల విద్యావంతుల వేదిక సభ్యులు లక్ష్మీనారాయణ, పి.సురేందర్ ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, రాజన్న, సాయందర్, సుధాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కంకర తేలి అధ్వానంగా మహాలింగి రోడ్డు

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

- కంకరతేలి అధ్వానంగా మారిన బీటీ రోడ్లు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు



గుంతలమయంగా మొగ్లి రోడ్డు

తానూరు: ప్రజల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం మారుమూల గ్రామాలకు సైతం రూ.లక్షలు వెచ్చించి రోడ్డు నిర్మాణాలు చేపడుతోంది. కానీ తానూరు మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన రోడ్లపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో రోడ్లపై గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పలు గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. దీంతో పలువురు వాహనదారులు కింద పడి ప్రాణాలు కోల్పోతుండగా.. మరికొందరు గాయాల పాలవుతున్నారు. దీంతో రాత్రివేళ ప్రయాణం అంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

ప్రమాదకరంగా రోడ్లు..

మండలంలోని బెల్‌తరోడా-సోనారి ఎక్స్‌రోడ్డు నుంచి మహలింగి, బామ్ని, ఝరి(బి) నుంచి ఝరి(బి) తండా రోడ్డు, తానూరు నుంచి వయా కోలూరు మీదుగా మొగ్లి గ్రామం వరకు, ఖర్బాలా నుంచి జౌలా(బి) ఎక్స్‌రోడ్డు వరకు, ముధోల్ నుంచి ఎలవ్రత్, వాడవన రోడ్లు ఎన్నో ఏళ్ల కిందట నిర్మించినవి కావడంతో కంకర తేలి గుంతలమయంగా మారాయి.

ఈ గ్రామాల్లో ఉన్న బీటీ రోడ్లు మరమ్మతులకు నోచుకోక ప్రమాదకరంగా మారాయి. మరోవైపు రోడ్లు గుంతలమయంగా ఉండటంతో ప్రైవేటు వాహన చోదకులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రయాణికులకు ఇక్కట్లు..

బెల్‌తరోడా-సోనారి జేఎస్ రోడ్డు నుంచి మహలింగి, బామ్ని, ఝరి(బి) నుంచి ఝరి(బి)తండా, ముధోల్ నుంచి ఎల్విత్, జౌలా(బి) నుంచి ఖర్బాల, తానూరు వయా కోలూరు మీదుగా మొగ్లి గ్రామాలకు ఉన్న బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారాయి. తమ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే కిలోమీటరు మేర నడిచి వాహనాల్లో వెళ్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

తూతుమంత్రంగా మరమ్మతులు..

మండలంలోని జౌలా(బి) గ్రామం నుంచి ఖర్బాలా గ్రామానికి ఉన్న బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. సంబంధిత శాఖ అర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయాల్సి ఉన్నా.. తూతుమంత్రంగా గుంతల్లో మొరం నింపి చేతులు దులుపుకొన్నారు. దీంతో అదుపు తప్పి వాహనాలు పడటంతో పాటు వర్షాకాలంలో బురదమయంగా మారుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

జరిగిన రోడ్డు ప్రమాదాలివీ..

- ఇటీవల బామ్ని ఎక్స్‌రోడ్డు సమీపంలో ద్విచక్రవాహనం గుంతలను తప్పించే క్రమంలో ముగ్గురు వాహనంపై నుంచి పడ్డారు. ఈ ఘటనలో కర్బెల్లి గ్రామానికి చెందిన బత్తుల్‌వార్ చంద్రకళ అక్కడికక్కడే మృతిచెందింది.
- రెండు నెలల కిందట ఝరి(బి) గ్రామానికి చెందిన ఇద్దరు రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తూ వడ్‌ఝరి(బి) సమీపంలో పడటంతో తీవ్రంగా గాయపడ్డారు.
- మూడేళ్ల కిందట మహారాష్ట్రలోని సిరుల్ గ్రామానికి చెందిన వ్యక్తి గుంతలు తెలియక దౌలతాబాద్ గ్రామ సమీపంలో అదుపు తప్పి కింద పడటంతో మృతి చెందాడు.
- బామ్నితండా సమీపంలో సాల్లి గ్రామానికి చెందిన ఇద్దరు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



బామ్ని గ్రామానికి వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

– సట్ల సిద్దన్న, బామ్ని గ్రామస్తుడు

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని తానూరు -మొగ్లి, ఝరి(బి), మహలింగి, బామ్ని, ఎల్వత్ గ్రామాల్లో రోడ్లు మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం.

–చందు, పీఆర్ డీఈఈ

మంత్రి సమక్షంలో నాయకుల వాగ్వాదం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో నిర్మించిన అంబేద్కర్ భవన్ నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, దళిత సంఘాల నాయకుడు సత్యనారాయణ మధ్య సోమవారం వాగ్వాదం చోటు చేసుకుంది. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి సమక్షంలో జరిగిన గొడవకు కలెక్టర్ కార్యాలయం వేదికైంది. అన్ని జిల్లాల్లో అంబేద్కర్ భవన్‌లను సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా కేవలం నిర్మల్‌లో మాత్రమే మున్సిపాలిటీ వారు ఎందుకు నిర్వహిస్తున్నారని దళిత సంఘాల నాయకులు ప్రశ్నించారు. అంబేద్కర్ భవన్‌ను మున్సిపాలిటీ వారు ప్రైవేటు ఫంక్షన్లకు అద్దెకు ఇవ్వడం సరికాదని సోషల్ వెల్ఫేర్ సొసైటీ వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. మంత్రి స్పందించి అంబేద్కర్ భవన్ నిర్వహణ విషయమై ఓ కమిటీ ఏర్పాటు చేసుకొని దాని ఆధ్వర్యంలో నిర్వహించుకుందామని సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

మూడు రోజులు విద్యుత్ బంద్

ఖానాపూర్: రోడ్డు వైడింగ్ పనుల్లో భాగంగా ఖానాపూర్‌లోని పలు ప్రాంతాల్లో మూడు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతి తెలిపారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు పనులు జరుగుతున్నందున ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని దీక్ష



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బందికి కనీస మూల వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కేజీబీవీలు ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోరుతూ జూన్ 8న చలో ఎస్‌పీడీ ఆఫీస్ ముట్టడి నిర్వహిస్తున్నామని.. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎస్ఓను ప్రిన్సిపాల్‌గా, పీజీ సీఆర్టీలను జెఎల్స్‌గా, సీఆర్టీలను స్కూల్ అసిస్టెంట్లుగా, పీఈటీలను పీడీలుగా గుర్తించి పోస్ట్ బేసిక్ పేను ఇవ్వాలన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల మాదిరి తమకు సెలవులను వర్తింపజేయాలని కోరారు. కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. పార్ట్ టైం కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, వొకేషనల్ ట్రైనర్లను సీఆర్టీలుగా మార్చి బేసిక్ పే ఇవ్వాలన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చి నగదు రహిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

మొక్కలు ఎండిపోతే చర్యలు

లక్ష్మణచాంద: నర్సరీల్లో మొక్కలు ఎండిపోతే బాధ్యులపై చర్యలు తప్పవని డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని పొట్టపెల్లి(కే), లక్ష్మణచాంద గ్రామాల్లో వారు పర్యటించారు. నర్సరీని, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించి మాట్లాడారు. మొక్కలు ఎండిపోకుండా మూడు పూటలు నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్నారు. ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గ్రామంలో ఇంకుడుగుంతల నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీవో నసీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు విక్రమ్ రాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నీటి నమూనాల సేకరణ

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామంలో సోమవారం మిషన్ భగీరథ నీటి నమూనాలను సిబ్బంది సేకరించారు. సేకరించిన నమూనాలను జిల్లా మిషన్ భగీరథ ల్యాబ్‌కు పంపనున్నారు. ఇందులో సర్పంచ్ లక్ష్మీరమేశ్, ల్యాబ్ క్షేత్రసహాయకుడు సంపత్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామాలకు ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య పరిశీలించారు. అనంతరం వరిధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆర్ఐ రాజన్న తదితరులు ఉన్నారు.

బీడీ కంపెనీల్లో టేకేదార్ల దోపిడీని అరికట్టాలి

ఖానాపూర్: పలు బీడీ కంపెనీల్లో యూనియన్‌ల పేరిట కార్మికుల నుంచి టేకేదార్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి ఆరోపించారు. . సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీడీ కంపెనీల్లో టేకేదార్లు కార్మికులకు తినుబండారాలు అంటగడుతూ నెలకు రూ.300 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు విచారణ చేయకుంటే కార్మికులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఏబీపీసీ జిల్లా అధ్యక్షుడిగా సునీల్‌దత్

ముధోల్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఆష్టా గ్రామానికి చెందిన సునీల్ దత్ గురుస్వామి నియమితులయ్యారు. ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమలరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లంరాజులు.. సునీల్‌దత్‌ను నియమిస్తూ సోమవారం ప్రకటించారు.

సంతాపం

ఖానాపూర్: ఖానాపూర్ సీనియర్ నాయకులు, ఉమ్మడి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వీకే ప్రభాకర్ ఆదివారం రాత్రి హఠాన్మరణం చెందారు. వారి మృతికి టీజీవో జిల్లా అధ్యక్షులు శ్యామ్‌నాయక్, హన్మంతు, మాల మహానాడు జిల్లా కన్వీనర్ నేత శ్యాం, స్థానిక కౌన్సిలర్ కావలి సంతోష్, అంబేద్కర్ సంఘం నాయకులు, తదితరులు సంతాపం తెలిపారు.

'ఏడో వార్డులో సమస్యలు పరిష్కరించాలి'

భైంసాటౌన్: భైంసా పట్టణంలోని ఏడో వార్డులో సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్ అనిత బాలాజీ సూత్రావే కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించినట్లు పేర్కొన్నారు. వార్డులో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నట్లు తెలిపారు.

పశువైద్యాధికారిని నియమించాలి

కడెం: మండలంలోని లింగాపూర్ పశువైద్యశాలకు రెగ్యులర్ పశువైద్యాధికారిని నియమించాలని పలువురు రైతులు సోమవారం పశువైద్యశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రెగ్యులర్ సిబ్బంది లేక లింగాపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో జీవాలకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ రంజిత్, రైతులు స్వామి, భరత్, లింగన్న, రాకేశ్, రాజు, సురేశ్ పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకం చేపట్టండి

లోకేశ్వరం: రైతులు పాడి పశువుల పెంపకం చేపట్టి..ఆర్థికంగా ఎదగాలని అబ్దుల్లాపూర్ ఎస్‌బీఐ శాఖ మేనేజర్ తిరుమలేశ్ అన్నారు. సోమవారం మండలంలోని నగర్, గడ్‌చాంద, బామ్నికే గ్రామాల్లో ముద్ర రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులను కలసి వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్ నరేందర్‌రెడ్డి, భైంసా బీఎంసీ ఇన్‌చార్జి మేనేజర్ గజ్జారాం, నిర్మల్ డెయిరీ మేనేజర్ దత్తు నాయక్, రమేశ్, నరేశ్, ప్రకాంత్ పాల్గొన్నారు.

కార్యవర్గ సమావేశంలో బీజేపీ నేతలు

ఖానాపూర్: హైదరాబాద్‌లో సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సంజయ్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో సప్పల పోశెట్టితోపాటు మృతి చెందిన పలువురి కుటుంబాలను సోమవారం మంత్రి అల్లోల తనయుడు గౌతం రెడ్డి పరామర్శించారు. అనంతరం పార్టీ స్థానిక కార్యాలయంలో మండల నేతలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ కె.దేవేందర్‌రెడ్డి, ఆత్మ డైరెక్టర్ సప్పల రవి, ధనె రవి, ముత్యం, దుప్పి సాయన్న, హరిపాటిల్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన

సోన్: జీవన ఎరువుల వినియోగంతో భూమి సారవంతమై పంట దిగుబడులు పెరుగుతాయని సోన్ మండల వ్యవసాయ విస్తరణాధికారి అంబాజీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జీవన ఎరువులతో దిగుబడులు పొందిన మహేశ్ చేనును సందర్శించి మాట్లాడారు. సర్పంచ్ వినోద్‌కుమార్, కృష్ణప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



తానూరులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శారద

తానూరు: మండల కేంద్రంలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలపై అంగన్‌వాడీ టీచర్లు, తల్లులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చిన్నారులకు చిరుధాన్యాల ఆహారం అందించేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. సిరి ధాన్యాలతో అంగన్‌వాడీ కార్యకర్తలకు వంటల పోటీలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ కృపారాణి, సెక్టర్ పరిధిలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చిరుధాన్యాలతో వంటల తయారీపై సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు పోటీలు నిర్వహించారు. రాజూర అంగన్‌వాడీ కార్యకర్త పద్మజకు ప్రథమ బహుమతి, పోట్‌పల్లి అంగన్‌వాడీ టీచర్ కాంత ద్వితీయ బహుమతి సాధించారు. తహసీల్దార్ సరిత, ఎంపీడీవో సల్మాన్‌రాజ్, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, వివిధ గ్రామాలకు చెందిన 27 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, మంత్రి

నిర్మల్‌చైన్‌గేట్: దళిత వైతాళికుడు సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. భాగ్యరెడ్డి వర్మ 134వ జయంతిని కలెక్టరేట్‌లో సోమవారం అధికారికంగా నిర్వహించారు. మంత్రి, కలెక్టర్ ముఖ్యఅతిథులుగా హాజరై వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ సంఘ సంస్కర్తగా, ఆంధ్రసభ స్థాపకుడిగా హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ ఎరువులు, విత్తనాలు విక్రయించొద్దు

సారంగపూర్: కల్తీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం మండలంలోని ఆయా గ్రామాల ఫెర్టిలైజర్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలో చాలా చోట్ల నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయన్నారు. వ్యవసాయ, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు. స్టాక్ వివరాలు, విక్రయించిన మందుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వ్యవసాయాధికారి రాజశేఖర్‌రెడ్డి, వివిధ గ్రామాల డీలర్లు తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే విక్రయించాలని సీఐ నారాయణనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని సత్తనపల్లి రైతువేదికలో ఖానాపూర్, పెంబి మండలాల ఫెర్టిలైజర్ దుకాణాల డీలర్లు, నిర్వాహకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కొనుగోలు సమయంలో రైతులకు తప్పకుండా రసీదు ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ఆసం రవి మాట్లాడుతూ రైతులు విత్తనాలు విత్తిన కవర్లు, రసీదులను దాచుకోవాలన్నారు. డీలర్లు తమ లైసెన్స్ అనుమతి పత్రాలతోపాటు స్టాక్ వివరాలు, ధరల పట్టిక రైతులకు కనిపించేలా నోటీస్ బోర్డులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుజాత, ఎస్సై ఆర్.శంకర్, తదితరులు ఉన్నారు.

సర్కారు బడికి రూ.3లక్షల విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న హరిప్రసాద్‌రావు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామానికి చెందిన హరిప్రసాద్‌రావు హైదరాబాద్‌లోని పోచారం మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు సోమవారం తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.3లక్షల విరాళాన్ని డీఈవో రవీందర్‌రెడ్డి సమక్షంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలిసి విరాళం చెక్కును అందజేశారు. తన తండ్రి బెజ్జంకి సురేందర్‌రావు జ్ఞాపకార్థం మనఊరు-మనబడిలో భాగంగా పాఠశాల అభివృద్ధి కోసం ఈ సొమ్మును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్శ్వపు శ్రీనివాస్, శనిగారపు శ్రావన్, నాయకులు పాదం రాజేశ్వర్, నరేందర్, గణేశ్, బుచ్చాగౌడ్, మురళీ, శంకర్ తదితరులు ఉన్నారు.

ఇంకుడుగుంతలతో భూగర్భజలాలు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని నూతన కాలనీలో సోమవారం ఇంకుడుగుంతల నిర్మాణ పనులను దిలావర్‌పూర్ సర్పంచ్ జంగం వీరేశ్ ప్రారంభించారు. ఇంటి ఆవరణలో నిర్మించే ఇంకుడు గుంతకు రూ.ఆరు వేలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతకు రూ.14వేలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. వీటి నిర్మాణాలపై ప్రజలు దృష్టి సారించాలని ఆయన కోరారు. ఎంపీఓ అజీజ్‌ఖాన్, ఈవో చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోన్: నీటిని వృథాను అరికట్టి.. భూగర్భజలాలు పెరిగేలా ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలని సోన్ మండల ఇన్‌చార్జి ఎంపీడీవో మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం సోన్, న్యూవెల్మల్ గ్రామ పంచాయతీల వద్ద ఇంకుడుగుంతల నిర్మాణం ప్రారంభించారు. అనంతరం నర్సరీలో పెంచుతున్న మొక్కలు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో మంజులరెడ్డి, ఎంపీవో ఖలీల్, హైమద్, ఏపీఎం గంగామణి, సోన్ సర్పంచ్ వినోద్‌కుమార్, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్, గడ్డం స్వామి, కృష్ణ, లక్ష్మణ్, సంధ్య, సాయన్న పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: ఇంటింటా కిచెన్‌గార్డెన్, ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని స్వచ్ఛభారత్ మిషన్ కన్సల్‌టెంట్ అబుజార్ పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటి వద్ద మరుగుదొడ్లు నిర్మించి వాటిని వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, ఏపీవో ప్రమీల, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.



గూడు కల్పించండి సారూ

తనకు గూడు కల్పించాలని కొన్ని నెలలుగా ప్రజావాణిలో వేడుకుంటున్నా అధికారులు స్పందించడం లేదని వాపోయింది నిర్మల్‌కు చెందిన దివ్యాంగురాలైన లక్ష్మి. కనీసం వీల్‌చైర్ కూడా లేదని.. ఇల్లు లేకపోవడంతో తెలిసిన వారి ఇళ్లలో ఉంటూ రోజులు గడుపుతున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం మరోసారి ప్రజావాణికి వచ్చి అధికారులను వేడుకుంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

నేడు

మండల సమావేశం

తానూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు తానూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.